రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# సంస్కృతికి చిహ్నం సంక్రాంతి

### రంగవల్లుల పోటీల్లో బుయ్యని సరళారెడ్డి

**తాండూరు, జనవరి 11, ప్రభాతవార్త :** సంక్రాంతి మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమని ఆర్బీవోఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతీ వాకిట్లో అందమైన రంగవల్లులతో ముస్తాబై తెలుగుదనం ఉట్టి పడేలా చేస్తుందని కొనియాడారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాల పరిరక్షణలో మహిళలు ప్రధాన భూమిక పోషిస్తున్నారని అన్నారు. సరళారెడ్డి మిత్రమండలి, ఆత్మీయుల ఆధ్వర్యంలో ఆదివారం తాండూరు నేతా గురుకుల్ స్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీ ఘనంగా నిర్వహించారు. ఆర్డీవోఎల్ సంస్థ యాజమాన్యం వారు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅథితిగా హాజరైన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సరళారెడ్డి మాట్లాడుతూ క్యాలెండరులో తొలి నెలలోనే వచ్చే పెద్ద పండుగ సంక్రాంతికి ఎంతో విశిష్టత ఉందన్నారు. వానాకాలంలో రైతులు వేసుకున్న పంటలు సంక్రాంతి వరకల్లా చేతికి వస్తాయని గుర్తు చేశారు. పిల్లలు గాలిపటాలతో ఆడకుంటూ, మహిళలు అందమైన ముగ్గులతో



ఇంటి ముందు ముస్తాబు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. హరిదాసులు గంగిరెద్దులతో ఇంటిముందుకు రావడం శోభాయమానంగా ఉంటుందని సంక్రాంతి పండుగ విశిష్టతను గుర్తు చేశారు. తమ ఆర్బీవోఎల్ సంస్థ ఔత్సాహికులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడే కార్యక్రమాలకు చేయూతనిస్తుందని చెప్పారు. విద్యార్థులకు, యువతకు, మహిళలకు అండగా నిలుస్తామని సరళారెడ్డి హామీ ఇచ్చారు.

## గతి తప్పుతున్న మున్సిపల్ పాలన-అడ్డదారులకే అగ్రపీఠం

### ఎజెండాను పక్కదారి పట్టిస్తున్న కౌన్సిలర్లు | చిల్లర ఖర్చుల పేరిట రూ.లక్షల దుబారా

### అన్ని పక్షాలదీ అదే బాట | ప్రజాధనాన్ని పిండేస్తున్న సిబ్బంది

# పురపాలిక..మారు ఇక!



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజల మౌలిక సదుపాయాల కల్పనలో స్థానిక సంస్థలు ఎంతగానో తోడ్పతాయి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీలు, పట్టణాల్లో మున్సిపాలిటీలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. ఐదేళ్ల పాటు ప్రజలచే ఎన్నుకోబడిన పాలకవర్గాల పనితీరు ఆధారంగా స్థానిక సంస్థలకు మంచిపేరు తీసుకువస్తాయి. 'చెత్త'శుద్ధి గల వారి వల్ల సంస్థలకు చెడ్డ పేరు తెచ్చి పెడుతోంది. పంచాయతీల విషయం పక్కనబెడితే మున్సిపాలిటీల్లో కనీస వసతులలో ప్రధానంగా మెరుగైన రోడ్ల నిర్మాణం, నిరాటంకంగా మంచినీటి సరఫరా, వీధులను శుభ్రపరచడం, మురుగునీటి కాల్వల శుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ, పట్టణ సుందరీకరణ, చీకటి పడగానే దేదిప్యమానంలా విద్యుత్ వెలుగులు అందంచడం ఇదే ప్రధానమైన అంశాలు.

వీటన్నింటినీ సమకూర్చాలంటే ఆదాయ వనరులు కూడా ప్రధానమే. ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లతో పాటు సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. పారిశుధ్య కార్మికుల వేతనాలు, వాహనాల రిపేర్లు, నిర్వహణ వంటి వాటికీ ఖర్చు చేయవచ్చు. ఈ సాధారణ నిధులు సమకూర్చుకోవాలంటే ప్రజల ఇంటి పన్నులు, నీటి కొళాయి పన్నులు, వ్యాపార ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ద్వారా వచ్చే ఆదాయం నూరు శాతం ఖజానాకు అందేలా అధికారులు పని చేయాలి. కానీ వీటిపై పూర్తిస్థాయి శ్రద్ధ ఏ మున్సిపాలిటీల్లోనూ కనిపించడం లేదు.

ఆదాయ వనరుల సమీకరణ, ప్రభుత్వం నుంచి కొత్త నిధులు తీసుకురావడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయి. కేవలం తమ జేబులు నింపుకొనే ప్రయత్నంలో చాలాచోట్ల పాలకవర్గాలు అవినీతి వైపు మొగ్గు చూపించాయి. దానికి తోడు కొంతమంది అధికారులు కూడా పక్కదారి పడుతున్నారు. తరచూ ఎసిబికి చిక్కి కటకటాల పాలవుతున్నారు. అయినా వ్యవస్థలో మార్పు కనిపించడం లేదు.

### రచ్చ మినహా చర్చ లేని కౌన్సిల్ సమావేశాలు

చాలామంది కౌన్సిల్ సమావేశాల్లో అర్థంకాని అరుపులతో విలువైన సమయం వృధా చేస్తున్నారు. సభ్యులు ఎలా ఉండాలో తెలియక విచిత్రమైన ప్రవర్తనలో సభా మర్యాదలను మంట గలుపుతున్నారు. అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారు. అరుపులు, పెడబొబ్బలు, వ్యక్తిగత ధూషణలు, మహిళా సభ్యుల పట్ల అనుచిత ప్రవర్తన సర్వసాధారణంగా మారాయి. కొన్ని అంశాలపై విపక్షాల విధానం అస్పష్టంగా ఉంటున్నది. ప్రజలకు ఉపయోగపడే అంశాలను ఆమోదించడం లేదు. అనవసర అంశాలను ఆమోదిస్తూ వ్యక్తిగతంలో లబ్దిపొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అవినీతి విషయంలో సభ్యులు ఏకతాటిపైకి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి.

### అవినీతి మరకలు ఇలా..

◆మున్సిపాలిటీల్లో ఆసరా పింఛన్ల కుంభకోణం పెద్ద దుమారమే లేపింది. పదేళ్ల క్రితం ఆసరా పింఛన్లను బ్యాంకుల ద్వారా కాకుండా లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. స్థానిక కౌన్సిలర్ల సహాయంతో ఈ నగదు పంపిణీ జరిగింది. అయితే, ఒక్కో వార్డులో 100 మంది లబ్ధిదారులు ఉంటే 50 నుంచి 60 మందికే పంపిణీ చేశారు. అలా యేడాది కాలం పాటు పింఛన్ల డబ్బులు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది జేబుల్లోకి వెళ్లాయి. ఒక్క తాండూరు మున్సిపాలిటీలోనే రూ.2.50 కోట్ల పింఛన్లు పక్కదారి పట్టాయని ఉన్నతాధికారుల విచారణలో తేలింది. అప్పట్లో ఓ కమిషనర్, మేనేజరును సస్పెండ్ చేయడం సంచలనమైంది. వారి నుంచి రూ.2 కోట్ల వరకు పింఛన్ డబ్బును రికవరీ కూడా చేశారు.

◆మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేసే పారిశుధ్య కార్మికుల వేతనాలను కూడా సరిగ్గా ఇవ్వలేదు. నెలసరి వేతనాల్లో సగానికి సగం కోత విధించారు. అలా కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారు. పలు మున్సిపల్ పాలకులపై ఈ మరక పడింది. కార్మికులకు ఇచ్చే సబ్బులు, నూనెలు, డ్రెస్సులలో కూడా చేతివాటానికి పాల్పడ్డారు. ఈ కుంభకోణంపై కూడా పలు మున్సిపాలిటీల్లో విచారణ జరిగింది. కానీ చర్యలు నామమాత్రంగానే తీసుకున్నారు.

◆.వాహనాల కొనుగోలు, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు అంశంలో ప్రజాధనం పక్కదారి పట్టిస్తున్నారు. తరచూ వాహనాల రిపేర్ల పేరిట లక్షల రూపాయలు దుబారా చేస్తున్నారు. పలు మున్సిపాలిటీల్లో రోజూ చెత్త ఎత్తే ట్రాక్టర్లు, ఆటోలు నడుపడం లేదు. కానీ ఆయా వాహనాలకు డీజిల్ ఖర్చులు మాత్రం రాస్తున్నారు. అలా రోజూ వేల రూపాయలను డీజిల్ పేరిట పక్కదారి పట్టించి కొంతమంది అధికారుల, కౌన్సిలర్ల జేబుల్లోకి వెళుతున్నట్లు తెలిసింది.

◆చిల్లర ఖర్చుల పేరిట ప్రతినెలా రూ.లక్ష నుంచి 2 లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. చాయ్ బిస్కట్లు, స్టేషనరీ, జిరాక్సుల పేరిట ఈ మొత్తం ఖర్చు పెడుతున్నట్లు ఎజెండాలో పొందుపరిచి కౌన్సిల్ ఆమోదం పొందుతున్నారు. పాలకవర్గాల పదవికాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలనలోనూ చిల్లర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు పెద్దగా ఫోకస్ చేయడంలేదు. ప్రజల్లో అవగాహన లేక ప్రజాధనం దుర్వినియోగం అవుతూనే ఉంది.

◆ఇల్లీగల్ లేఔట్లలో స్వపక్షాలు, విపక్షాలు ఏకమవుతున్న దాఖలాలూ ఉన్నాయి. మున్సిపాలిటీల పరిధిలో రియల్ ఎస్టేట్ విస్తరించిందంటే పాలకులకు పండుగే. లీగల్‌గా లేఔట్ పూర్తి చేస్తే కౌన్సిల్ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలి. ఎజెండాలోని ఈ అంశంపై చర్చకు వచ్చినపుడు మెజార్టీ సభ్యులు ఆమోదించాలి. కానీ ఇక్కడా తిరకాసు పెడతారు. చాలాచోట్ల వెంచర్ నిర్వాహకుల నుంచి పెద్ద ఎత్తున నజరానాలు తీసుకున్న తర్వాతనే ఆమోదిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.
పలువురు చైర్మన్లు, కౌన్సిలర్లు బినామీల పేరిట తక్కువ ధరలకే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇల్లీగల్ వెంచర్లకైతే భారీ ఎత్తున డబ్బులు గుంజుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా ఉంటుంది. అందుకే కోట్లు ఖర్చు చేసి కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికవుతున్నారు.

◆పన్నుల వసూలులోనూ చేతివాటం ఉంటోంది. ఏళ్ల తరబడి ఆస్తి పన్నులు చెల్లించని గృహ యాజమానుల, దుకాణ యజమానుల నుంచి దండిగా డబ్బులు వసూలు చేసి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. సెటిల్ అయిన ఆస్తులకు తక్కువ పన్ను నిర్ధారించి వసూలు చేస్తున్నారు. ఇలా కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయి. కిందిస్థాయి ఉద్యోగులు కూడా కోట్లకు పడగెత్తుతున్నారు.

# తాండూరు అభివృద్ధికి 18.7 కోట్లు

### రూ.5 కోట్ల వ్యయంతో కాంక్రీటు మురుగునీటి కాల్వలు, కల్వర్టులు

### రూ.11.70 కోట్లతో సిసి రోడ్లు

### రూ.1.10 కోట్లతో పార్కుల రక్షణ

### గొల్లచెర్వు దుర్గంధం నివారణకు రూ.90లక్షలు




**తాండూరు, జనవరి 11, ప్రభాతవార్త :** పట్టణ మౌలిక సదుపాయాల కల్పన (యూఐడిఎఫ్) నిధుల కింద తాండూరు మున్సిపాలిటీకి రూ.18.70 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు పురపాలన శాఖ నుంచి శనివారం జీవో విడుదలైంది. ఒకటి నుంచి 36వ వరకు ఉన్న వార్డులలో యూఐడిఎఫ్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జివో ప్రతులను మీడియాకు అందజేశారు.
నిరుడు అక్టోబరు మాసంలో అంచనా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ప్రతిపాదిత వార్డులలో రూ.5 కోట్ల వ్యయంతో సిసి కాంక్రీటు మురుగునీటి కాల్వలు, కల్వర్టులు నిర్మాణం, రూ.11.70 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, రూ.1.10 కోట్లతో బాలాజీ నగర్ పార్కు, ఓల్డ్ పంప్ హౌజ్, కొత్త పంపు హౌజ్ వద్ద పార్కుల రక్షణకు కేటాయించనున్నారు. రూ.90లక్షలతో గొల్లచెర్వులో దుర్గంధం నుంచి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రాఘవేంద్ర టెంపుల్ నుంచి చెన్గేష్ పూర్ రోడ్డులోని ఈద్గా వరకు సల్లేజ్ సిసి డ్రైన్ నిర్మిస్తామని ఎమ్మెల్యే వివరించారు. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.
ఇలా ఉండగా తాండూరు మున్సిపాలిటీకి రూ.18.70 కోట్లు మంజూరు కావడం పట్ల మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల రత్నమాల నర్సింహులు, సాంబూరు సోమశేఖర్ తదితరులు వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల ప్రకారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధులు తెచ్చి తాండూరు అభివృద్ధికి పాటు పడుతున్నారని కొనియాడారు.



మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

## మీరు అరెస్ట్ చేయలేకపోతే ఆపని మేమే చేస్తాం

### ల్యాండ్ మాఫియా దాడులపై ఎంపి ఈటల రాజేందర్ ఆగ్రహం

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 11, ప్రభాత వార్త:** ఏకశిలా వెంచర్‌లో ప్లాట్ ఓనర్స్‌పై దాడులకు ఉసిగొల్పిన రియల్టర్ వెంకటేశ్‌ను 24 గంటల్లో అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రియల్టర్‌ను అరెస్టు చేయకపోతే తామే ఆ పని చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోచారం డివిజన్ పరిధిలోని కొర్రెముల ఏకశిలా నగర్ వెంచర్‌లో గత రెండు రోజులుగా ప్లాట్ ఓనర్స్‌కు, రియల్టర్‌కు మధ్యన ఘర్షణ చోటుచేసుకుంది. తమ ప్లాట్లను చూడటానికి వచ్చిన ప్లాట్ ఓనర్స్‌ను శనివారం రియల్టర్ అనుచరులు గుండాలు ఆయుధాలు చేతబూని విచక్షణారహితంగా చితకబాదారు. రీయల్టర్ గుండాలు ముక్కుమ్మడిగా దాడి చేయడంతో పలువురు ప్లాట్ ఓనర్స్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఎంపీ గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం ప్లాట్ ఓనర్స్‌కు మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కొర్రెముల గ్రామంలో 146 ఎకరాల్లో 2086 ప్లాట్లు చేస్తే చిరు ఉద్యోగులు ప్లాట్లు కొన్నారని తెలిపారు. ల్యాండ్ మాఫీయా వెంకటేశ్ ఆ స్థలాలను రికార్డుల్లో మిగతా 2లో

## గుర్తుతెలియని వ్యక్తి హత్య

### కొత్తూరులో కలకలం 2



శంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న బాదేపల్లి సిద్దార్థ

## సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్ రెడ్డి

**షాద్‌నగర్, జనవరి 11, ప్రభాతవార్త :** సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా షాద్ నగర్ నియోజక వర్గం మధురాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ లక్నాపురం శివశంకర్ రెడ్డి (శివారెడ్డి) ఎన్నికయ్యారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీలలో రంగారెడ్డి జిల్లా పరిషత్ హాలులో జరిగిన జిల్లా సర్పంచుల చైతన్య సదస్సులో ఈ ఎన్నిక మిగతా 2లో

# సీతారామ్‌రెడ్డి సేవలు భేష్

### సురంగల్‌లో ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు

### 10 ఏళ్ల లోపు ఆడపిల్లలకు సొంత నిధులతో 10వేలు డిపాజిట్

### అభినందించిన మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం

**మొయినాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమే ద్యేయంగా అనునిత్యం ప్రజా సంక్షేమ కార్యాక్రమాలను చేప్పట్టి అందరితో శబాష్ అనిపించుకుంటున్న బిజెపి యువనాయకుడు గుమ్మాల సీతారాం రెడ్డి, మొయినాబాద్ మున్సిపలిటిలోని సురంగల్‌లో గుమ్మాల సీతారాం రెడ్డి ప్రజా సంక్షేమ కార్యాక్రమాలు చేపడుతున్నారు, ఆదివారం సురంగల్‌లోని మెడ్విన్ కంటి ఆసుపత్రి నుండి వైద్యులను పిలిపించి గ్రామంలోని ప్రతి ఒక్కరి కొసం ఉచ్చిత కంటి పరిక్షలను, ప్రధానమంత్రి సుకన్య సమృద్ధి యోజన పథకము నిర్వహించారు, ఈ కార్యాక్రమానికి మాజి ఎమ్యేల్యే రె.ఎస్ రత్నం బిజెపి నియోజకవర్గం ఇన్‌చార్జీ ముఖ్యఅతిధిలుగా హాజరయ్యారు, ఈ సందర్బంగా కె.ఎస్ రత్నం మాట్లాడుతూ మొయినాబాద్ మండలంలో బిజెపి పార్టీ తరుపున అత్యధికంగా సంక్షేమ పథకాలు నిర్వహిస్తున్న సీతారాం రెడ్డిని చూస్తే ఎంతో ముచ్చటేస్తుందని, నిత్యం ప్రజా సంక్షేమమే ద్యేయంగా కుల,మతాలకు, అతీతంగా సేవాకార్యాక్రమాలు నిర్వహిస్తున్నాడని, అభినందించారు, ఆయన చేసిన ఎన్నో కార్యాక్రమాలకు నేను హాజరయ్యానని, ఇన్ని అన్ని కాదని, గ్రామంలో యువకులందరిని ఒక్కదాటి పైకి తెచ్చి వారికి ప్రతి ఏటా క్రీడలు నిర్వహించి, వారికి బహుమతులు, ప్రైజ్‌మని, గతంలో గ్రామంలోని రైతులకు పంటలకు స్ప్రే పంపులను మెడికల్ క్యాంపులు, వృద్దులకు వికలాంగులకు, చేతికర్రలు స్టాండ్‌లు, నడుము బెల్టులు, నిరుద్యోగ మహిళలకు ఉచ్చితంగా మగ్గం వర్క్ పై శిక్షణ, ఉచ్చితంగా కుట్టుమిషిన్లు పంపిణి, బ్లడ్‌క్యాంప్‌లు ఎన్నో కార్యాక్రమాలు నిర్వహించాడని, ఇప్పుడు గ్రామంలో ప్రతి ఒక్కరికి కంటి చూపు ఎంతో అవసరమని అందిరికి ఉచ్చిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి సమస్య ఉన్నవారికి ఉచ్చితంగా కంటి అద్దాలు కూడ అందజేస్తున్నాడని, అన్నిటికి మించి, ఆడపిల్లను కొందరు భారంగా చూసే సమాజంలో తన వంతు బాధ్యతగా ప్రధానమంత్రి మిగతా 2లో



# ఆ ఆరు గ్రామాల్లో వీడిన చిక్కుముడి

### అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలలో వార్డుల ప్రకటన

**శామీర్‌పేట, జనవరి 11, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలో ఆరు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు మున్సిపల్ పరిధిలో మొత్తం 20వార్డులు ఉండగ గ్రామాల వారీగ వార్డుల సంఖ్యల వివరాలు ఇలా ఉన్నాయి. అలియాబాద్ గ్రామంలో 7, 8, 9, 17, 18, 19, 20వ (గ్రామంలో-7) వార్డులు ఉన్నాయి. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో 5,6,14,15,16వ (గ్రామంలో-5) వార్డులు ఉన్నాయి. తుర్కపల్లిలో 1, 2, 3, 4వ ( గ్రామం లో-4)వార్డులు ఉన్నాయి. మజీద్‌పూర్‌లో 10,11వ (గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. యాడారంలో 12వ వార్డు ఒకటి, మురహరిపల్లిలో 13వ వార్డు ఒకటి ఉన్నాయి. అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలో 20వార్డులు ఉన్నాయి. ఇక త్వరలో ఆయా వార్డులకు రిజర్వేషన్లు ఖరారు కావలసి ఉంది. వార్డులకు పోటీ చేయాలనుకునే వారు రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తూ టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు.
..ఇక మూడుచింతలపల్లి (మండలం) మున్సిపాల్టీలో 14 గ్రామాలు ఉండి 24వార్డులు ఉన్నాయి. ఇక ఆ మున్సిపాల్టీ పరిధిలోని 14గ్రామాలలో కేటాయింపు జరిగిన వార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. అద్రాస్‌పల్లిలో 22వ, 23వ (గ్రామంలో-2) వార్డులు, అనంతారంలో 1వ వార్డు (గ్రామంలో-1) ఒకటే వార్డు ఉంది. జగ్గంగూడలో 13, 14,15వ వార్డులు (గ్రామంలో-3) వార్డులు ఉన్నాయి. కేశ్వాపూర్‌లో 9, 10వ వార్డులు (గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. కేశవరం గ్రామంలో 20, 24వ వార్డులు (గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. కొల్తూర్‌లో 16,17,18,19 వార్డులు మిగతా 2లో



## 15 మంది వేద విద్యార్థులకు జయ పత్రికలు

**కీసర, జనవరి11, ప్రభాతవార్త:** వేద విద్య ఎంతో పవిత్రమైందని ప్రధానాచార్యులు శ్రీనివాస శర్మ అన్నారు. కీసరగుట్టలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేద విజ్ఞాన పీఠం 26వ వీక్షాంత సమారోహము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానముల పరిపాల్క మాసమున కీసరగుట్టలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠముయందు విద్యనభ్యసించిన విద్యార్థులు సుప్రసిద్ధ పండితులుగా వెలుగొందుచూ వేద విజ్ఞానపీఠ కీర్తిని ఇనుమడింపజేస్తూ తెలుగు రాష్ట్రాలలో మకుటాయమానముగా నిలబెట్టారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు జయ పత్రికలు, ప్రోత్సాహక స్వర్ణ రజత, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి, దెందుకూరి రామచంద్ర సోమయాజి, కేదారనాథ ఘనపాఠి, తితిదే ఇంజనీరింగ్ విభాగము ఏఈఓ చలమానాయక్, సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



**తలకొండపల్లి, జనవరి 11, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, టాస్క్ సీఈవో, ఐక్యత ఐక్యత ఫౌండేషన్ ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటిసి ఉప్పల వెంకటేష్‌లు ముఖ్యఅతిథిగా మిగతా 2లో

## దుష్ప్రచారాలు చేసే చానళ్లపై చర్యలు తప్పవు

### -తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి

**వికారాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర మంత్రులపై కొన్ని తప్పుడు చానళ్లు దుష్ప్రచారాలు చేస్తే సహించబోమని, తగు చర్యలు తీసుకుంటామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ఇందులో భాగంగా ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో తప్పుడు ప్రచారాలు చేసిన మిగతా 2లో

## సీతారామరెడ్డి సేవలు భేష్

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్రమోడి ఏర్పాటుచేసిన సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని గ్రామంలోని 10సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఆడబిడ్డకు పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరిపించి విడుతల వారిగా 10 వేలు ఒక్కొక్కరి పేరున జమచేస్తున్నాడని, ఆతని సేవా కార్యాక్రమాలు ఎంతో భేష్ అని కొనియాడారు, నిత్యం గ్రామ క్షేమము, సంక్షేమము కొసం పరితపించే సీతారాం రెడ్డి కి మీ సహాయం మద్దతు అవసరమున్నప్పుడు అందరు అండగా ఉండి అతనీని ఆశీర్వదించాలన్నారు, ఈ కార్యాక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, ఎస్. ప్రభాకర్ రెడ్డి, గున్నాల గోపాల్ రెడ్డి, క్యామ పద్మనాభం, మున్సిల్ అధ్యక్షులు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, ప్రభుయాదవ్, ప్రశాంత్ గౌడ్, బోర్రజగన్, కొంగరి నారాయణరెడ్డి, పాశం బాల్‌రాజ్, విజయ్‌గౌడ్, పాండు యాదవ్, మధుసుదన్‌గౌడ్, కర్రోళ్ల కన్న, బోర్ర సందీప్, బోర్ర శివ, రామగల గిరిబాబు, ఆర్. రాజు, శంభు యాదవ్, రవియాదవ్, సోమజ్ఞానేశ్వర్ తధితరులు పాల్గొన్నారు,

## వైభవంగా లక్ష్మీనరసింహాస్వామి కల్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

హాజరైనారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళ్యాణోత్స వాన్ని వారు తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావం అలవర్చుకోవాలని, అన్ని మతాల సారాంశం ఒకటేనని, మానవులంతా భక్తి భావంతో సోదర భావంతో మెలగాలని, గ్రామాలు అభివృద్ధికి అందరు తోడ్పాటు అందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ముఖ్య అతిథులకు ఆలయ ప్రధాన ధర్మకర్తలు కూడా యాదగిరి నరసింహ శర్మ, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో స్వామి వారి శాలువతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కళ్యాణోత్స వానికి రంగారెడ్డి జిల్లా పరిధిలోని కేశంపేట్, తలకొండపల్లి కర్తాల్, అమంగల్, మాడుగుల, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని ఊరుకొండ పేట, మిడ్జిల్ మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడం జరిగింది. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించడంతో స్థానిక సర్పంచి వానరాశి రాములమ్మ మూడు లక్షల రూపాయలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాక్సి ఈఓ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్, ప్రధాన అర్చకులు శ్రీనివాసమూర్తి, స్థానిక సర్పంచ్ వానరాశి రాములమ్మ, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకరి ప్రభాకర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, ఉప సర్పంచ్ విజయలక్ష్మి ✓, మాజీ ఎంపీటీసీ అంబాజీ, డైరెక్టర్ వెంకటరెడ్డి, తోపాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మీరు అరెస్ట్ చేయకపోతే ఆపని మేమే చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మార్పిడి చేసి 47 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నాడని అన్నారు. భూమిని దొంగచాటుగా పట్టాచేసుకుని ప్లాట్లు కొన్నవారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. గత యేడాది ల్యాండ్ మాఫియా గుండాలు ప్లాట్లలో తిష్టవేసి ఉండగా తాను ఇక్కడికి వచ్చి బాధితులకు ధైర్యం చెప్పానని అన్నారు. అనాడే డీజీపీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయానని సమస్య పరిష్కరం అయ్యింది అనుకున్నానని అన్నారు. అనాడు ఎంపీ అయినా తనపై కేసులు పెట్టారని ఆ కేసులు కొనసాగుతుండగా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలిసినప్పటికినీ ఎవరి చెప్పకుండా ఎవరికి వత్తాసు పలుకడానికి అధికారులు సర్వేకు వచ్చారని ప్రశ్నించారు. రీయల్టర్‌కు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు ఎవరిని వదలిపెట్టమని అన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడటం సరికాదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో బీద ప్రజలకు రక్షణ కరువైందని అన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించని సీఎం రేవంత్‌రెడ్డి సిగ్గుపడాలని అన్నారు. ఆనాడు ధరణి, నేడు భూభారతి పేరుతో అదే గుండాలు అదే ల్యాండ్ మాఫీయాలు రాజ్యమేలుతున్నారని అన్నారు. ఇక్కడి భూ కబ్జాల వెనుక మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులున్నారని వారిపై సీఎం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాట్ ఓనర్స్‌పై దాడులకు పాల్పడిన ఏ ఒక్కరిని పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని పోలీసుల తీరుపై అనుమానాలున్నాయని అన్నారు. స్థానిక పోలీసులు రియల్ మాఫీయాతో కుమ్మకై బాధితులపై దాడులకు ఉసిగొల్పుతున్నాడని ఆరోపించారు. డీజీపీ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వతీరుతోనే ఏకశిలా నగర్‌లో జరిగిన దాడి పరకాష్టగా నిలిచిందని అన్నారు. ఈ సంఘటనపై పోలీస్ అధికారులు స్పందించి 24 గంటల్లో చర్యలు చేపట్టాలని లేదంటే బీజేపీ తరపున కార్యచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, నియోజకవర్గ ఇంఛార్జీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఘట్‌కేసర్, పోచారం డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహీపాల్‌రెడ్డి, నానావత్ సురేశ్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్, నాయకులు చలువాది ప్రవీణ్‌రావు, కొమ్మిడి శోభారాణి, గట్టుపల్లి మల్లేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా మాధవి రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా అయ్యావారిపల్లి గ్రామ సర్పంచ్ గోటికె గోపాల్ రెడ్డి, అదేవిధంగా జక్క రవీందర్ రెడ్డి, బొప్పిడి గోపాల్ ఎన్నికయ్యారు. ఇక ప్రధాన కార్యదర్శులుగా ఈ.రవి, జే. పద్మకృష్ణ, కార్యనిర్వాహ కార్యదర్శిగా మూడావత్ శీను ఎన్నికయ్యారు. వీరు ఎంపిక జిల్లాలోని ఆ సర్పంచుల సమక్షంలో ఏకగ్రీవంగా జరగడం విశేషం. రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం నూతన కమిటీని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ తదితరులను అయ్యావారిపల్లి గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.

సారధిగా మాత్రమే కాకుండా అటు ప్రభుత్వానికి, ఇటు సర్పంచులకు వారధిగా నిలిచి ప్రభుత్వం ద్వారా నిధులు సాధించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వెన్నుముకగా నిలవాలని రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందితే గ్రామాలు సర్వాంగ సుందరంగా తయారవుతాయని, తద్వారా వ్యవసాయం, కుటీర పరిశ్రమలు పెరిగి దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు. నాయకులుగా ఎన్నికైన వాళ్ళు చిత్తశుద్ధితో ముందడుగు వేసి సర్పంచ్ల సమస్యలపై పోరాడాలని, గ్రామ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వాల ద్వారా నిధులు సేకరించే విషయంలో కలిసికట్టుగా పోరాటం చేసేందుకు ముందుకు రావాలని స్పష్టం చేశారు.

**చిత్తశుద్ధితో పనిచేస్తా..**

సర్పంచులకు నిరంతరం అండగా ఉండి చిత్తశుద్ధితో పనిచేస్తానని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శివ శంకర్ రెడ్డి (శివారెడ్డి) అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాల సహకారం ఎంతో అవసరం అని, లేదంటే గ్రామాలు అభివృద్ధి చెందడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. అందుకే గ్రామీణ ప్రాంతాలలో సకాలంలో నిధులు అందేలా ప్రభుత్వంతో పోరాటం చేస్తామని ఆయన అన్నారు. తనకు అవకాశం ఇచ్చి ముందుకు నడిపిన సహ సర్పంచులకు, రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తూరులో గుర్తుతెలియని వ్యక్తి హత్య
### శివనగర్ కాలనీలో కలకలం

**కొత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ పరిధిలోని శివనగర్ కాలనీలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గుర్తుతెలియని ఇద్దరు లేదా నలుగురు వ్యక్తులు ఈ హత్యకు పాల్పడ్డారని ప్రాథమిక సమాచారం అందుతోంది. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉండగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను గుర్తించి త్వరలోనే పట్టుకుం



ముగ్గుల పోటీలలో గెలిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి

**కీసర, జనవరి 11, ప్రభాతవార్త :** సంస్కృతిక సాంప్రదాయాలు నేర్పుతూ సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉన్నదని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదిరెడినడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగారం ఈస్ట్ గాందీనగర్ కాలనలో మాజీ ఎంపిపి మాదిరెడ్డి స్వప్న ఆద్వర్యంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. కాలనీలోని సుమారు 200 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సాంప్రదాయాలను తెలియపరిచే విధంగా ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలిచిన మహిళలకు మొదటి బహుమతిగా 3 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 2 వేలు, మూడవ బహుమతిగా వెయ్యి రూపాయలు బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సత్యంసాగర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆదం షఫీ, కాలనీవాసులు జికే మూర్తి, బెంజిమన్, శ్రావణ్, లక్ష్మణ్ నాయక్, అంజిరెడ్డి, కాజా, పుల్లారావు, సాయి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏటా సంక్రాంతి ప్రోత్సాహకాలు ఇస్తాం



సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలతో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు



ఎదులాబాద్‌లో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## చౌదరిగూడలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 11, ప్రభాత వార్త:** రెండేళ్లల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం తేలిపోయిందని బీఆర్ఎస్ కావాలని ప్రజలు అంటున్నారని స్థానిక కార్పోరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దుమ్మురేపడం ఖాయమని స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు సామల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ యువనేత సామల సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో దాదాపు 900 మంది మహిళలు, యువతులు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచారం డివిజన్‌లో బీఆర్ఎస్ యువనేత సామల సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కతాటిపైకి వచ్చి ముగ్గుల పోటీలు విజయవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువనాయకుడి ఆధ్వర్యంలో రాబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో పోచారం డివిజన్‌లో గులాబీ దుమ్మురేపాలని అన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు పంపిణీ చేయగా, మిగతా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి చీరలు బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు విచ్చేసిన వారికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ యువనాయకుడు సామల సందీప్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, సామల బుబ్బిరెడ్డి, మాజీ సర్పంచులు ఒరుగంటి వెంకటేశ్ గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, నాయకులు నీరుడి శ్రీనివాస్ ముదిరాజ్, ఎరుకల దుర్గారావు, మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, మందస్వామిదాస్, వేగానంద్, జబర్దస్త్ ఫేం కొమ్రక్క తదితరులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు అందజేత**

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** పండుగలను సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా ఘనంగా జరుపుకోవాలని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన తిలకించారు. సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం పట్ల ఆయన నిర్వహకులను అభినందించారు. మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో జరిగిన రంగువల్లుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ఈసందర్భంగా గెలుపొందిన మహిళలకు నగదు, బహుమతిలో పాటు పాల్గొన్న వారికి బహుమతలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ దొంకెన బిక్షపతిగౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఎదుగని క్రిష్ణమూర్తి, మాజీ ఎంపిటిసిలు మంకం రవి, నాగులపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఆరు గ్రామాల్లో వీడిన చిక్కుముడి

(మొదటి పేజీ తరువాయి)

(గ్రామంలో-4) వార్డులు ఉన్నాయి. లక్ష్మాపూర్ గ్రామంలో 3,5 వార్డులు (గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. లింగాపూర్ తండ, నాగిశెట్టిపల్లిలో 7వ వార్డు (రెండు గ్రామాలకు ఒకటే) ఉంది. మూడుచింతలపల్లిలో 4,6వ వార్డులు (గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. నారాయణపూర్, పోతారం గ్రామాలకు కలిపి 2వ వార్డు (ఆ రెండు గ్రామాలకు కలిపి ఒకటే) వార్డు ఉంది. పొన్నాల్ గ్రామంలో 11,12వ వార్డులు (ఆ గ్రామంలో-2) వార్డులు ఉన్నాయి. ఉద్దెమర్రి గ్రామంలో 21,8,9వ వార్డులు (ఆ గ్రామంలో-3) వార్డులు ఉన్నాయి. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని 14గ్రామాలకు 24వార్డులు కేటాయించటం జరిగింది. ఇక మున్సిపల్ ఎన్నికలు త్వరలో ఉన్నందున ఆయా వార్డులకు రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇక వార్డులకు రిజర్వేషన్లు, షెడ్యూల్ వెలువడాల్సి ఉంది. పోటీ చేసే నాయకులు మాత్రం రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తూ టెన్షన్‌లో ఉన్నారు. వార్డుల కౌన్సిలర్ పదవిల కోసం ఎదురుచూడటంతో పాటు కొందరు సీనియర్ నాయకులు మాత్రం చైర్మన్ పదవి రిజర్వేషన్ ఎలా ఉంటుందోనన్న టెన్షన్‌లో ఉన్నారు. మెజార్టీ కౌన్సిలర్లు కలిసి చైర్మన్‌ను తరువాత ఎన్నుకోవటం జరుగుతుంది. అయితే రిజర్వేషన్లు కౌన్సిలర్ వార్డులకు, చైర్మన్ పదవికి రిజర్వేషన్లు ఖరారు కావలసి ఉంది.

## దుష్ప్రచారాలు చేసే చానళ్లపై చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

చానళ్ళకు ప్రజలు ఏ విధంగా బుద్ది చెప్పారో..అదే తీరుగా దుష్ప్రచారాలు చేస్తే తప్పుడు చానళ్ళకు కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ది చెప్పి తీరుతుందని స్పష్టం చేశారు. మంత్రి సీఎం రేవంత్‌రెడ్డి తో పాటు మంత్రులపై లేనిపోని నింధలు వేసి కొన్ని చానళ్ళు అబద్ధపు ప్రచారాలు చేయడం తగదని హితవు పలికారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంతో బాదతో కొన్ని చానళ్ళపై అసంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ఇంతటితో అడ్డుకట్ట వేయకుంటే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాధవి రామ్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## సర్పంచ్‌ల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మాధవిరామ్‌రెడ్డి

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త :** సర్పంచుల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్ కు చెందిన తిప్పని మాధవి రామ్ రెడ్డి ఎన్నికయ్యారు. సర్పంచ్ ల సంఘం ఆత్మీయ సమావేశంలో ఆమెను జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని సర్పంచులకు అండగా నిలబడి వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## ఘనంగా మైసమ్మ బోనాలు

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త :** ధర్మాసాగర్‌లో ఆదివారం మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం ప్రతి సంవత్సరం సంక్రాంతి నెలలో నిర్వహించే బంగారు మైసమ్మ భోనాల పండుగను రంగరంగ వైభవంగా నిర్వహిచారు. మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్దలతో బోనాలు చేశారు. పోతురాజులు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరెగింపు కన్నులపండుగగా జరిగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున జాతర ఉత్సావాల్లో పాల్గొన్నారు.

## దొంగతనాల నివారణకు ప్రచార వాహనం

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా తాళం వేసి ఊర్లకు వెళ్లే వారు పోలీసుల సూచనలు పాటించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి కమీషనర్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ దృష్ట్యా దొంగతనాల నివారణకు ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రారంభించారు. ప్రచార ఆటో పట్టణం పరిసర కాలనీలు, కాలనీల్లో తిరుగుతూ ప్రజలకు చోరీల నివారణపై అవగాహన కలి ్పంచడం జరుగుతుందని తెలిపారు. ఆటోకు దొంగతనాల నివారణకు ప్రజలు పాటించాల్సిన విషయాలను ఫ్లెక్సీ ముద్రించామని ప్రజలు తగిన సలహాలు, సూచనలు తీసుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి : బిజెపి నేత మోహన్‌రెడ్డి



బిజెపి నాయకుల కార్యశాల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి

**శామీర్‌పేట, జనవరి 11, ప్రభాతవార్త :** త్వరలో జరుగనున్న మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికలకు బిజెపి నాయకులు సిద్ధం కావాలని మేడ్చల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి సూచించారు.

ఆదివారం మూడుచింతలపల్లి మండల బిజెపి అధ్యక్షులు టి.నరేందర్‌గౌడ్ అధ్యక్షతన కేశవరంలోని ఫంక్షన్‌హాల్‌లో బిజెపి నాయకుల కార్యశాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు రానున్నందున వార్డులలో బిజెపి నాయ కులు పోటీ చేయటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల నాయకులు వార్డు లకు పార్టీ తరపున పోటీకి దింపాలని భావిస్తున్నందున రిజర్వేషన్ల కోసం చూడకుండ సమాయత్తం కావాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మూడుచింతలపల్లి మండల బిజెపి అధ్యక్షులు టి.నరేందర్‌గౌడ్, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, దయాకర్, నాగరాజుచారి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, డి.మహేష్, విజయలక్ష్మి, పరమేశ్, హనుమంతు, జగన్మోహన్‌రెడ్డి, కల్యాణి, వెంకటేశనాయక్, సాయిబాబు, అరుణ్, సంతోష్, నరేశ్, వీరేశ్‌నాయక్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్, వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణ, జగదీశ్, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భువనేశ్వరికి పురస్కారంపై హర్షం

**షాద్‌నగర్, జనవరి 11, ప్రభాతవార్త :** పాడి ప్రగతి ఆశయంగా డెయిరీ రంగాన్ని దేశవ్యాప్తంగా నారా భువనేశ్వరి అభివృద్ధి చేశారని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ప్రశంసించారు. డెయిరీ రంగంలో తాను చేసిన అభివృద్ధికి గాను ఇండియన్ డైరీ అసోసియేషన్ సౌత్ జోన్ ద్వారా అవుట్ స్టాండింగ్ డైరీ ప్రొఫెషనల్ అవార్డును నర భువనేశ్వరి అందుకోవడం పట్ల హర్షం ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆమె పాడి అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

## ఆన్లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య

**కేశంపేట జనవరి 11 ప్రభాతవార్త:** ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేశంపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ కు చెందిన గుడ్డు కుమార్ యాదవ్ 20 సంవత్సరాలు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు ఆన్లైన్ బెట్టింగులకు అలవాటు పడ్డ వ్యక్తి కూలి పనులు చేయగా వచ్చిన డబ్బులతో ఆన్లైన్లో గేములు ఆడుతూ వచ్చిన డబ్బులు పోగొట్టుకొని మానసికంగా బాధపడుతూ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈ నెల 6న ఇంటి నుండి బయలుదేరాడని అప్పటినుండి తన ఆచూకీ ఎక్కడ వెతికిన లభించలేదని ఆదివారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని చనిపోయి ఉన్నాడని తెలియడంతో అక్కడికి వెళ్లి చూడగా గుడ్డు కుమార్ మృతి చెంది ఉన్నాడని అతని అన్న బబ్లు కుమార్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

## ఆకట్టుకున్న మోక్షధృతి నాట్యకళా ప్రదర్శన

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతీలో గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో కూచిపూడి నృత్యకారిణి మోక్షధృతి ప్రదర్శన ఆకట్టుకున్నది. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోక్షధృతి రవీంద్రభారతీలో కూచిపూడి నృత్యప్రదర్శన చేయగా గ్లోబల్ ఈవెంట్స్ అధ్యక్షులు కేవీ.రమణారావు, పోలీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్తా, సరస్వతీ ఉపాసకులు బ్రహ్మశ్రీ ధైవజ్ఞశర్మలు ప్రదర్శనను తిలకించి అభినందించారు. ఈసందర్భంగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని వారు మోక్షధృతికి అందజేశారు. నాట్యగురువులు ఝాన్సీరామ్, సునీత, అంజన, కళాభారతి, నిర్మల, మైథిలి తదితరులు పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీయాలి

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఆర్‌సి రెడ్డి స్టడీసర్కిల్ శిక్షకులు డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, మోటివేషనల్ స్పీకర్ ఆకేళ్ల రాఘవేంద్రలు పేర్కొన్నారు. ఘట్‌కేసర్‌లోని ఎస్‌పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ 20 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వార్షికోత్సవ వేడుక ఒడిస్సీ 2026 లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించారు. నృత్యాలు, సంగీతం, నాటక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళానైపుణ్యాలను, ఇతర కరిక్యులర్ కార్యకలాపాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందెశ్రీ స్మృతివనం పనులు ప్రారంభం

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మించతలపెట్టిన కవి అందెశ్రీ స్మృతివనం పనులను అధికారులు ఎట్టకేలకు మొదలుపెట్టారు. ప్రభుత్వం ఘట్‌కేసర్ హెచ్ఎండిఏ ఓఆర్ఆర్ జంక్షన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో అందెశ్రీ స్మృతివనం నిర్మాణం చేసేందుకు రూ.6 కోట్లు మంజూరు చూసింది. జాతీయరహదారి (163) ఓఆర్ఆర్‌కు మధ్యన ఉన్న సర్వేనంబర్ 579లోని 1-22 ఎకరాల ఖాళీ స్థలాన్ని అందెశ్రీ స్మృతివనం కోసం కేటాయించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి భూమి సర్వేచేయించి స్థలం అప్పగించడంతో ఇక్కడ అందెశ్రీని ఖననం చేశారు. స్మృతివనం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలు గడుస్తుండటంతో నిర్లక్ష్యం, జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల పలు అధికారులు శాఖల అధికారులు, ఆర్కెటిక్స్, అందెశ్రీ కుమారుడు దత్తసాయిలు సమాధి స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. ఎట్టకేలకు ఆదివారం కేటాయించిన స్థలం చుట్టూ ఇనుప సీకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అందెశ్రీ స్మృతివనంతో పాటు ఓపెన్ ఆడిటోరియమ్, సమాధి చుట్టూ ఉద్యానవం ఏర్పాటు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టారు. తెలంగాణ బాషా సాంస్కృతిశాఖ సంచాలకులు ఏనుగు నర్సింహ్మారెడ్డి ఆదేశాల మేరకు హెచ్ఎండిఏ ఈఈ హరికృష్ణ పర్యవేక్షణలో కాంట్రాక్టర్ ఓర్సు యాదయ్యకు అప్పగించగా కూలీలతో అందెశ్రీ స్మృతివనంకు ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారు.

## లయన్స్‌క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఘట్‌కేసర్ సర్కిల్ కరీంగూడ రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన్యాల అశోక్ చేతుల మీదుగా 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మేడిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వేముల కేశవనాధంగౌడ్, ఘట్‌కేసర్ చార్టెడ్ అధ్యక్షులు సార శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి బచ్చు ప్రమోద్‌గుప్తా, కోశాధికారి సన్నిధి కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు రేసు లక్ష్మారెడ్డి, హిమబిందు నవీన్, బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, బొగ శ్రీలక్ష్మి హరినాథ్, చుక్కల రవిశంకర్, పి.రాఘవేంద్రప్రసాద్, ఎం.జంగయ్య, ఎస్.రాజు, సంతోష్, కమలాకర్, మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యవారిపల్లిలో ఆదివారం సంత ప్రారంభం

**షాద్‌నగర్, జనవరి 11, ప్రభాతవార్త :** వారానికి పొద సరుకులు కూరగాయలు ఇతర వస్తువులు కొనుక్కునే విధంగా ఏర్పాటు చేసిన అంగడి (సంత) ను అయ్యావారిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు గోటిక గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఫరుక్ నగర్ మండల పరిధిలోని అయ్యావారిపల్లి గ్రామంలో ఆదివారం పూట నూతనంగా సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో కూరగాయలను స్వయంగా కొన్ని వ్యాపారస్తులను ప్రోత్సహించారు. ఇకపై ప్రతి ఆదివారం సంతను ఏర్పాటు చేసే విధంగా వ్యాపారస్తులతో మాట్లాడి ప్రోత్సాహం అందిస్తామని, గ్రామ అంగడి కోసం వారికి గ్రామపంచాయతీ నుండి అవసరమైన వనరులను సమకూర్చుతామని గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ గ్రామానికి చెందినవారే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడా ఉత్సాహంగా సంతకు వస్తారనీ తాము తెచ్చిన వస్తువులను అమ్మివేసి తమకు కావలసిన వస్తువులను కొనుక్కొంటారనీ తెలిపారు. ప్రాచీనమైన వస్తు మార్పిడి పద్ధతి దీని నుంచే సంత మొదలయ్యిందనీ పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళి కొనుక్కొనే వాటి కంటే సంతలో దొరికే వస్తువుల ధరలు సాధారణంగా తక్కువగా ఉంటాయనీ దీనివల్ల కాలయాపన జరగాలని అదేవిధంగా రైతుల నుండి నీరుగా కొనుక్కోవడం ద్వారా రైతులు కూడా వ్యాపారపరంగా లబ్ధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మన ప్రాంతంలో నిర్దుష్టమైన వస్తువుల కోసమే ప్రత్యేకంగా జరిగే సంతలు కూడా ఉంటాయనీ ఉదాహరణకు పశువుల సంత, చేపల సంత, స్వడ్ల సంత మొదలైనవి ఉన్నాయని వాటిని ఆదర్శంగా తీసుకొని అయ్యావారిపల్లిలో వారపు సంత జరగడం విశేషం అని అన్నారు. సంత నిర్వాహణకు గ్రామ పంచాయితీ కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తుందనీ సంత పెరిగితే వారికి గుడారాలకు స్థలాలు కేటాయిస్తుందనీ వివరించారు. ఇన్ని విధాలుగా గ్రామంలో అందరికీ ఉపయోగపడే సంత గురించి అందరూ ఎదురుచూసే విధంగా భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేసి రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

## ఒంటరి మహిళలకు పల్లె బ్రదర్స్ ఆసరా

**కేశంపేట, జనవరి 11, ప్రభాతవార్త:** గ్రామస్తులకు కొండంత అండగా నిలుస్తున్న పల్లె బ్రదర్స్‌ను అభినందించిన గ్రామస్తులు. కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్ల రాములు రాధమ్మ కుమారుడు వడ్ల యాదగిరి గత 40 సంవత్సరాల క్రితం తప్పిపోయాడు దీంతో అతని భార్య సరిత ఇద్దరు కూతుర్లు రక్షి త, వైష్ణవి పరిస్థితి దీనంగా మారింది వారి పరిస్థితి చూసి చలించిన పల్లె బ్రదర్స్ పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలేశ్వర్ లు వారి కుటుంబ పోషణ నిమిత్తం ప్రతినెల 2000 రూపాయలు ఆసరాగా ఇస్తామని ఆదివారం మహిళకు 2000 రూపాయలను అందించారు. ఇకపై ప్రతినెల ఇస్తామని పల్లె బ్రదర్స్ తెలిపారు. పల్లె బ్రదర్స్ గతంలో కూడా గ్రామం లోని ముగ్గురికి సొంతంగా ప్రతినెల ఆసరా పింఛన్లు ఇస్తున్నారు. ఈ నెల నుంచి వడ్ల సరిత కు కూడా ఆసరాగా ఉంటామని అన్నారు. పల్లె బ్రదర్స్ గ్రామంలో మహిళలకు చేస్తున్న సేవలను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బుర్రి మల్లేష్ గౌడ్ బండ మల్లేష్ యాదవ్ కుమ్మరి కరుణాకర్ లు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు బహుమతుల పంపిణీ

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువజన సంఘాల సభ్యులకు పలు క్రీడాపోటీలను నిర్వహించారు. ఉత్సవ సమితి కన్వీనర్ విప్పర్ల హనుమాన్, కో-కన్వీనర్లు బచ్చు నగేశ్‌కుమార్‌గుప్తా, సోమసాని రమేశ్ పెరికలు పిఇటీల సహాయంతో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, క్యారమ్స్ పోటీలను నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగోళీ పోటీలో దాదాపు 300 మంది పాల్గొనగా ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000లు, తృతాయ బహుమతి రూ.2,500లు చొప్పున పంపిణీ చేసి పాల్గొన్న వారికి చీరలు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ కళలు, సాంస్కృతికశాఖ కన్వీనర్ మంగళంపల్లి శ్రీహరి విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, జర్నలిస్ట్ నవత, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు కొమ్మిడి శోభారాణి, రేసు లక్ష్మారెడ్డి, బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కంభం లక్ష్మారెడ్డి, జేఏసి కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, వీరేశ్‌కుమార్, సార శ్రీనివాస్, చుక్కల రవిశంకర్, మంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత జంగయ్య

## నందిగామ పంచాయతీకి హైటెక్ హంగులు

**నందిగామ, జనవరి 11,ప్రభాతవార్త:** నందిగామ సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ ను ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నేతలు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు తడకల జంగయ్య, నరేందర్ రెడ్డి లు సర్పంచ్ ను శాలువా వేసి సన్మానించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో .. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్, జనహృదయనేత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అండదండలతో నందిగామ గ్రామ పంచాయతీని అత్యాధునిక హైటెక్ తరహాలో అన్ని హంగులతో.. ప్రగతికి బాటలు వేయాలని ఆకాంక్షి స్తూ అభినందనలు తెలిపారు..ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లుటైలర్ కృష్ణ, బొమ్మగల్ల నర్సింలు , నందిగామ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల రాములు, బి జంగయ్య గౌడ్, చించేటి కృష్ణ గౌడ్ , కేశమోని రామచంద్రి , తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరెలు పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ.

**నందిగామ, జనవరి 11,ప్రభాతవార్త:** నందిగామ మండలం బండకుంట తండాలో ఆదివారం గిరిజన మహిళలకు నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ , వార్డు సభ్యులతో కలిసి ఇందిరమ్మ చీరలు పంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలపై అధ్యయనం చేస్తున్నామని.. ప్రతి పల్లెను, తండాను ప్రగతి పథంలో నడిపించాలన్నదే లక్ష్యం గా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లింగం నాయక్ ,అగ్గిప్రసాద్, శివగల్ల సురేష్, బొమ్మ గళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, మాజీ ఎంపిటిసి కుమార్ గౌడ్ ,నాయకులు బి జంగయ్య గౌడ్, గోపాల్ నాయక్ ,శివ, అగ్గిసూరి,నరేందర్ రెడ్డి, గిరిజన మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులుగా.. పూర్వ స్నేహితులు

సర్పంచ్, వార్డ్ సభ్యులను సన్మానించిన పూర్వ స్నేహితులు



ప్రాణ స్నేహితులను సన్మానిస్తున్న పూర్వ స్నేహితులు.

**నందిగామ, జనవరి 11,ప్రభాతవార్త:** నందిగామ చదివిన ప్రాణ స్నేహితులు గత పంచాయతీ ఎన్నికల్లో ఒకరు సర్పంచ్ గా.. మరొకరు వార్డు సభ్యులుగా గెలిచి ప్రజాసేవలో ముందుకు సాగుతున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ ను, వార్డు సభ్యులు చెరసాని సుమలత నరసింహలును ఆదివారం నందిగామ గ్రామానికి చెందిన పూర్వ స్నేహితులు ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి ఇద్దరు మిత్రులు ప్రజాప్రతినిధులుగా కొనసాగడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా పరిపాలన రంగంలో రాణించి నందిగామకు వన్నె తేవాలని.. ఆకాంక్షి స్తూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వారు కోరుకున్నారు. పూర్వ స్నేహితులను సన్మానించిన వారిలో బోర్ర బంటు, పి యాదయ్య, మేక్కొండ శ్రీనివాస్ గౌడ్, గుండుబావి వెంకట్ రెడ్డి, గంగిశెట్టి రాజు, బుర్రి మాధవరెడ్డి, ఎన్ మురళి, ప్రసాద్ గౌడ్, వెంకటయ్యలు ఉన్నారు.

## అక్రమ అరెస్టులను సహించేది లేదు : బిజెపి

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బాత్కు శ్రీనివాస్ యాదవ్

**రంగారెడ్డి జిల్లా అర్బన్, జనవరి 11, ప్రభాతవార్త :** నిరుద్యోగుల పక్షాన బిజెపి పోరాడుతుంటే అది సహించలేని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా బిజెపి నేతలను అరెస్టు చేస్తుందని బీజేఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బాత్కు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం శంషాబాద్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల సమస్యలపై శనివారం నిర్వహించిన నిరసనకు మద్దతుగా వెళ్లిన బీజేఎం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేశ్, బిజెఎం నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అరెస్టు చేయడం అత్యంత బాధాకరమని బిజెఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బాత్కు శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగుల గొంతును అణిచివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. వెంటనే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసి, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు.కార్యక్రమంలో మల్లేశ్ యాదవ్, క్యామ శ్రీకాంత్, గౌతమ్ గౌడ్, రోహిత్ యాదవ్, హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి

**కీసర,జనవరి11,ప్రభాతవార్త:** సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని బిజెపి రాష్ట్ర నాయకులు,బోగారం మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.కీసరలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో సహకార సంఘంలో 2685 మంది రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు.గత 40 సంవత్సరాలుగా సహకార సంఘం బ్యాంకు ద్వారా రైతులకు పంట రుణాలు సబ్సిడీపై ఎరువుల సరఫరా జరుగుతుంద న్నారు.మేడ్చల్ జిల్లాలో ఉమ్మడి కీసర,ఘట్‌కేసర్ ,శామీర్‌పేట,మేడ్చల్ మండలాల్లో రైతు సంఘాలు పనిచేస్తూ ప్రభుత్వం ద్వారా నిధులు రైతులకు అందుతున్నాయని అన్నారు.ఈ సహకార సంఘాలకు అనేక సార్లు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ద్వారా డైరెక్టర్లు,చైర్మన్‌గా ఎన్నికయ్యారని అన్నారు.కానీ ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో తమ సొంత పార్టీ నేతలకు ఈ పదవులు కట్టబెట్టబోతున్నారు అనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఎన్నికల్లో ఓటమినే అలవాటుగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఈ విధంగా సహకార వ్యవస్థలో దొడ్డిదారిన ఓటు చోరీ ద్వారా సహకార వ్యవస్థలో నామినేటెడ్ పద్ధతిన సభ్యుల ఎంపిక అనేది పూర్తిగా ఓటు చోరీకి పరాకాష్ట అన్నారు.ఈ విధమైన చర్యలు ప్రజాస్వామ్యంలో కూని చేయడం, రైతులకు జరుగబోతున్న అన్యాయాన్ని బిజెపి పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఇప్పటికే రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన సంపూర్ణ రుణ మాఫీ పక్కన బెట్టి 50 శాతం మేరకు కూడా జరుగలేదన్నారు.రైతులకు ఇచ్చిన మాట తప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మధ్యలో దోషిగా నిటబెడతామని ప్రభుత్వాన్ని విమర్శించారు.



బోగారం మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి

## బహుమతులు పంపిణీ చేసిన ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి జనవరి11,ప్రభాత వార్త;** తలకొండపల్లి ఉప్పల ప్రీమియర్ లీగ్ టోర్నీలో భాగంగా ఈరోజు జెపి నగర్ తండా విజయం సాధించడం జరిగింది మ్యాన్ ఆఫ్ మ్యాచ్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ మాజీ సర్పంచ్ లలిత జోతయ్య వార్డ్ మెంబర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# యువతను క్రీడల వైపు నడిపిస్తున్న బిజెపి

- కబడ్డీ ఆటగాళ్లకు దుస్తుల అందజేత

**కొత్తూరు, జనవరి 11, ప్రభాత వార్త :** గ్రామీణ స్థాయిలో క్రీడల అభివృద్ధికి బిజెపి పార్టీ ముందుంటుందని మరోసారి చాటిచెప్పారు. కొత్తూరు మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు రణధీర్ గౌడ్. పెంద్యాల గ్రామంలో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న తిమ్మాపూర్ కబడ్డీ క్రీడాకారులకు ఆది వారం రణధీర్ గౌడ్, స్పోర్ట్స్ దుస్తులు అందజేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా రణధీర్ గౌడ్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువకులు క్రీడల్లో చురుకుగా పాల్గొని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగాలని సూచించారు. క్రీడలద్వారా సంపూర్ణఆరోగ్యం సాధ్యమవుతుందని, పోటీతత్వ భావన పెరిగి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలు మెరుగవు తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి క్రీడా కారులు వెలుగులోకి రావాలంటే ఇలాంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు బిజెపి పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కో కన్వీనర్ మదాపురం నరసింహగౌడ్ మరియు కొత్తూరు మున్సిపాలిటీ మాజీ బిజెపి అధ్యక్షులు ఎర్రవల్లి నాగరాచారి,సీనియర్ నాయకులు బొడ్డు జగన్,మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శులు కొసిగి మల్లేష్ నాగనీ సురేందర్ మరియు ఉపాధ్యక్షులు ఏనుగువిజయ్ భాస్కర్ రెడ్డి,వడ్ల ప్రభాకర్,బిజెపి నాయకులు సందీప్ ,క్రీడాకారులు భానుచందర్ ,కార్తీక్ ,అమర్నాథ్ ,త్రయంబకేశ్వర్ ,చైతన్య ,మహేష్ ,సుప్రీత్ ,సచిన్, బబ్లు మరియు ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

# గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

-మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త:** రానున్న చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో చేవెళ్ల బిఆర్ఎస్ నాయకుడు నత్తి క్రిష్టారెడ్డి అధ్వర్యంలో చేవెళ్లకు చెందిన తలారి యాదయ్యతో పాటు సుమారు 100 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ చేవెళ్లలో బిఆర్ఎస్ పార్టీ చాలా బలంగా ఉందని, నాయకులు పార్టీలు మారినంత మాత్రన పార్టీకి నష్టం కాదన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. చేవెళ్ల మున్సిపల్‌లో బిఆర్ఎస్ జెండాను ఎగుర వేయడం ఖాయమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.రైతులకు రుణమాఫీ,మహిళలకు మహలక్ష్మీ పథకం వంటి అంశాల్లో ప్రజలను మోసం చేసిందన్నారు.గత ప్రభుత్వ హయంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్ధి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల క్రిష్టారెడ్డి,మండల పార్టీ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నాయకులు నత్తి క్రిష్టారెడ్డి,మహేపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సమక్ష్యంలో బిఆర్ఎస్‌లో చేరిన చేవెళ్లకు చెందిన తలారి యాదయ్య

# గ్రామాభివృద్ధే మాలక్ష్యం

సర్పంచ్ శివశంకర్,మాజీ వైస్ ఎంపిపి మాణిక్యంగౌడ్



పూడూరు మండలం కద్మూరు బిసీకాలనీలో మంచినీటి పైప్‌లైన్‌కు మరమత్తులు చేస్తున్న నాయకులు



పూడూరు మండలం కద్మూరు-మేడిపల్లి కలాన్‌కు వెళ్లేదారికి ఇరువైపుల ఉన్న చెట్లను జెసిబితో తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శివశంకర్,మాజీ వైస్ ఎంపిపి మాణిక్యంగౌడ్ తదితరులు

**పూడూరు, జనవరి 11, ప్రభాతవార్త :** గ్రామాభివృద్దే తమ లక్ష్యంమని సర్పంచ్ శివశంకర్,మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యంగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండల పరిధిలోని కద్మూరు గ్రామ బిసి కాలనీలో మంచినీటి పైపులైన్ మరమ్మత్తులు,కద్మూరు నుండి మేడిపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువెపుల ఉన్న ముళ్ళ పొదలను జెసిబితో తొలగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా గ్రామంలోని మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన,బురదను తొలగించి శుభ్రపరిచామన్నారు.అదేవిధంగా గ్రామంలో మంచినీటి సమస్య ఉన్నందున ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో పాత బోరుబావీల్లో కొత్తమోటార్లను దించి కాలనీల్లోకి సరఫరా అయ్యే పైపులైన్లను సరిచేసి,మంచినీరును అందిస్తున్నామని,నీటి సరఫరా కాని ఏరియాకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సరఫరా చేసే విధంగా కృషి చేస్తామన్నారు.గ్రామంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని,కద్మూరు నుండి మేడిపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే బిటిరోడ్డుకు ఇరువెపులా ఉన్న చెట్లను జెసిబితో తొలగించడం వల్ల ఈరహదారి గుండా ప్రయాణించే వాహనదారులకు సౌకర్యంగా ఉండే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోచయ్య,శ్రీధర్,అనీల్,శేఖర్, నవీన్,లింగం, మల్లేష్,చింటు తదితరులు పాల్గొన్నారు.





బాధితునికి ఆర్థికసాయం చేస్తున్న సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

## బాధితునికి సన్‌రైజ్‌ట్రస్ట్ రూ.20 వేలు ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న సాలయ్యకు సన్‌రైజ్‌చారిటబుల్ ట్రస్టు రూ.20,000లు ఆర్థికసాయం చేసింది. ఎదులాబాద్‌కు చెందిన కొమ్ము సాలయ్య గతంలో ఊరుకావలికారుగా పనిచేసే వాడని ఊపిరితిత్తుల వ్యాధితో భాధపడుతూ సంవత్సరం పాటు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని వైద్య ఖర్చులు భరించలేకపోతున్నాడు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటుడగా ఇతని భార్య కూడా అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటుందని సమాచారం రావడంతో రామయ్య సూచన మేరకు ట్రస్ట్ సభ్యులు వారితో మాట్లాడి ఆర్థికసాయం చేయాలని నిర్ణయించారు. పేదకుటుంబం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండంతో ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని సన్‌రైజ్ ట్రస్టు సభ్యులు స్పందించి రూ.20 వేల చెక్కులను సాలయ్యకు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈకార్యక్రమంలో వై.సుందర్‌రావు, ఎం.శ్రీకాంత్, ఎం.దేవానంద్, బి.సోమయ్య, ఎన్.రామయ్య, టి.క్రిష్ణలు పాల్గొన్నారు.

## 16న శ్రీఘట్టుమైసమ్మగుట్ట ఆలయంలో బహిరంగ వేలం

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఈనెల 16న ఘట్‌కేసర్ శ్రీఘట్టుమైసమ్మగుట్ట దేవస్థానంలో వడిబియ్యం, చీరల వేలం (అమ్మవారికి కట్టి తీసినవి), లడ్డూ/పులిహోర ప్రసాద విక్రయ హక్కులకు పొందుటకు బహిరంగ వేలం వేయనున్నట్లు దేవస్థానం కార్యనిరహణాధికారిణి లగడపాటి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ శ్రీఘట్టుమైసమ్మగుట్ట దేవస్థానం మండపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ-ధర్మాదాయశాఖ నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించే వేలంలో ఆసక్తి కల్గిన వారు పాల్గొనాలని కోరారు. వడిబియ్యం, చీరల వేలం (అమ్మవారికి కట్టి తీసినవి), లడ్డూ/పులిహోరల విక్రయ హక్కుల కాలపరిమితి 20 జనవరి 2026 నుంచి 19 జనవరి 2027 వరకు ఉంటుందని, వేలంలో పాల్గొనే వారు రూ.5,000లు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. దేవాలయ ఉద్యోగులు, ఆలయానికి బకాయిపడిన వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని, వేలంలో పాల్గొనే వారు ముందుగా దేవస్థానంలో ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు చెల్లించని వ్యక్తి వేలంలో ప్రత్యేక్షంగా గాని పరోక్షంగా గాని పాల్గొనే అవకాశం ఉండదని, హెచ్చుపాటదారుని వేలం పాట దేవాదాయశాఖ ఆమోదం మేరకు ఉంటుందన్నారు. వేలం పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుడు వేలం సొమ్ము సగం వెంటనే చెల్లించాలని మిగతా సొమ్ము 3నెలలకు చెల్లించాలని పేర్కొన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్థలంలోనే సదరు దుకాణం నిర్వహించాలని, ఏడాది కాలపరిమితి ముగిసిన తర్వాత దుకాణాలను ఖాళీ చేసి దేవస్థానంకు అప్పగించాలని పేర్కొన్నారు. సమయానుకూలంగా షరతులు మార్చుటకు, ఎలాంటి కారణం చూపకుండానే వేలం పాటను నిలుపుదల, వాయిదా వేయడానికి దేవస్థానంకు సంపూర్ణ అధికారం ఉందని ఈఓ భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు.

## ఘనంగా కూడారై ఉత్సవం

**ఘట్‌కేసర్, జనవరి 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేతమన్నార్ రంగనాయకస్వామి దేవస్థానంలో ఆదివారం కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఆలయ ధర్మకర్తలు ఉత్సవమూర్తులను ఊరేగించారు. ధనుర్మాసం ఉత్సవాలలో భాగంగా 27వ రోజు భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకోగా వేదపండితుల మంత్రోచ్చారణాలు, భక్తుల గోవిందనామ స్మరణ, భక్త నృత్యాలు మధ్య కుడారై ఉత్సవం జరిపారు. భక్తులు అధిక విచ్చేసి కుడారై ఉత్సవాని న్న తిలకించి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. పాల్గొన్న భక్తులకు, దాతలకు అర్చకులు గంగాలంలు ప్రసాదంగా అందజేశారు. ఈసందర్భంగా కూడారై ఉత్సవానికి ఉప్పల్‌కు చెందిన గడ్డినాటి సింధూర నాగహరీష్ చౌదరి ఆధ్వర్యంలో 108 లీటర్ల పాలను వితరణ చేశారు. రమణీయం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళారత్న, కళాప్రభ రమణి కళాకళారులు బృందం ద్వారా గోదాకళ్యాణం అమూల్యమాల్యద శీర్షిక కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. సోమవారం ఆలయంలో అధ్యయన ఉత్సవాలు ప్రారంభం అవుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు. ఈనెల 15న సంక్రాంతి సందర్భంగా ఆలయంలో ఉదయం 10 గంటలకు శ్రీగోదారంగనాయకస్వామి కళ్యాణోత్సవం, 16న సాయంత్రం 7 అభిషేకం (నోము) నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఎదులాబాద్‌లో కుడారై ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయానికి సమిష్టి కృషి చేయాలి

**మేడ్చల్, జనవరి 11, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించేలా ప్రతి బూత్‌లో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు విక్రంరెడ్డి పిలుపునిచ్చారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో బిజెపి బూత్ నిర్మాణ్ అభియాన్ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ స్థాయిలో పరిష్టంగా ఉండే విదంగా నాయకులు పని చేయాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించే విదంగా సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఎవరికి వచ్చినా విజయమే తధ్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ పోచయ్య ముదిరాజ్, బూత్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్, నాయకులు కృష్ణ, భూపాల్, రవిచంద్ర, దేవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం, శ్రీకాంత్, వెంకట్, రుక్మారెడ్డి, రాములు, వెంకట్, మహేందర్ పాల్గొన్నారు.



బీజేపీ బూత్ నిర్మాణ్ అబియాన్ కార్యక్రమంలో పాల్గొన్న విక్రంరెడ్డి



## పారదర్శక పాలన అందించాలని దిశా నిర్దేశం

సర్పంచ్ కొమ్ము కృష్ణను సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి

**నందిగామ,జనవరి 11, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్ర సర్పంచ్ గా, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సర్పంచ్ కొమ్ము కృష్ణను రాష్ట్ర మంత్రి వాకిట శ్రీహరి సన్మానించారు.గ్రామ పంచాయతీలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలని అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శక పాలన అందించాలని దిశానిర్దేశం చేశారు.ఆయన వెంట వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్, టైలర్ కృష్ణ, బొమ్మగల నరసింహులు, ఎర్రగారి రమేష్, బి రాము, శివగళ్ళ సుమన్, తుమ్మల నర్సింగ్ యాదవ్ తో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

## బిజెపి బిఆర్ఎస్ పార్టీలకు ఓటమి భయం



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఆమనగల్లు, జనవరి11, ప్రభాతవార్త:** అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పట్టించుకోని బి ఆర్ ఎస్, బిజెపి పార్టీలకు రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వస్పుల మానయ్య అన్నారు. ఆమనగల్లు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేస్తున్న కృషిని చూసి జీర్ణించుకోలేక అధికార కాంగ్రెస్ పార్టీపై అర్థరహిత ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నాయని ఆయన విమర్శించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి మానయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పదేళ్లు, బిజెపి మున్సిపాలిటీ అధికారంలో ఉన్న ఆమనగల్లు అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎద్దేవ చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ఆమనగల్ ప్రజలను మభ్యపెడుతున్నాయి తప్ప చిత్తశుద్ధి మాత్రం చూపడం లేదన్నారు. ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ఆమనగల్ అభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నారని తెలిపారు. కసిరెడ్డి హయాంలో 50 పడకల ప్రభుత్వాసుపత్రి, మున్సిపాలిటీ అభివృద్ధికి 50 కోట్ల నిధులు, మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు విపక్షాలకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలు అప్పగించిన బాధ్యతలను విస్మరించిన బిజెపి టిఆర్ఎస్ పార్టీలకు వచ్చే పురపాలక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని మా అన్నయ్య జోష్యం చెప్పారు. అధికార పార్టీకే పట్టం కట్టాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని గుర్తించి రెండు పార్టీల నాయకులు ఉనికి కోసం వెంపర్లాడుతున్నాయని ఆరోపించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి చేపట్టిన పనులను ప్రజలకు చూపించి ఓటు అడగాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీకి ప్రజలు పట్టం కట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మా అన్నయ్య కోరారు.మండల అధ్యక్షుడు జగన్, నాయకులు కృష్ణ నాయక్, హలీం , ఖాదర్ , ఖాద్రి , కాలే మల్లయ్య, ఎంగలి ప్రసాద్, మల్లేష్ నాయక్, పులి కంటి మైసయ్య , సత్యం, నాజర్, ధోని, వెంకటేష్ , కండే సాయి, శీను , శివ , రాగ్య నాయక్, రమేష్ నాయక్, క్రిష్ణ యాదవ్,హంజాద్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని హత్యచేసిన కొడుకు అరెస్ట్

-చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త:** కన్న తల్లిని చంపిన కసాయి కొడుకును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చేవెళ్ల సిఐ శ్రీధర్‌భూపాల్ తెలిపారు. ఆదివారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో చేవెళ్ల సిఐ శ్రీధర్‌భూపాల్ విలేకరుల సమావేశం నిర్వహించారు.చేవెళ్ల మండలం దేవారంపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్‌రెడ్డి కన్నతల్లి సుమతమ్మ(60)ను 22.11.2025న ఇంట్లోనే గొంతు పిసికి హత్యచేశారని తెలిపారు. తల్లి సుమతమ్మ అక్కరూపకు ఆస్తిని రాసివ్వడం తో తల్లిపై కక్ష పెంచుకున్న కోడుకు రాఘవేందర్‌రడ్డి తల్లిని హత్య చేయాలని పథకం వెనుకుని హత్య చేశాడని తెలిపారు. కన్న తల్లిని హత్య చేసిన తప్పించుకు తీరుగుతున్న రాఘవేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్ తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అంతారం సర్పంచ్ జుట్టు రామస్వామి సూచించారు. ఆదివారం చేవెళ్ల మండలం అంతారం గ్రామంలో చేవెళ్ల లలిత హస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిభిరంను అంతారం సర్పంచ్ జుట్టు రామస్వామి ప్రారంబించారు. ఈ సందర్భంగా అంతారం సర్పంచ్ జుట్టు రామస్వామి మాట్లాడుతూ గ్రామస్తులకు వైద్య సేవలు అందించేందుకు ఉచితంగా చికిత్సలు చేపడుతున్నా మన్నారు. గ్రామస్తుల వద్దకే వైద్య సేవలు తీసుకు వస్తున్నామన్నారు. ఉచి తంగా బిపిషుగర్ వంటి పలుపరీక్షలు చేస్తున్నారని, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంతారం ఉపసర్పంచ్ కావలి వెంకటేష్‌బాబు, గ్రామస్తులు సుధాకర్, న్యాయవాది గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గన్నారు.



అంతారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించిన అంతారం సర్పంచ్ జుట్టు రామస్వామి

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కొత్తూరు, జనవరి 11, ప్రభాతవార్త:** విజయలక్ష్మి తీగపూర్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం ఒకరు మృతి కొత్తూరు మండలంలోని ఆదివారం విజయలక్ష్మి తీగాపూర్ రోడ్డు శ్రీ విజయలక్ష్మి వేబ్రిడ్జి వద్ద ఉదయం సుమారు 8:10 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో హనుమంతు 44 సంవత్సరాలు అనే వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంతో పడి ఉన్న హనుమంతును మృతిని తల్లి సత్యమ్మకి తన తమ్ముడైన దాసరి రాములు చూసి తల్లికి తెలపడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమె తెలిపిన వివరాల ప్రకారం, తన రెండవ కుమారైన హనుమంతు విజయ పోలీ ప్లాస్టిక్ కంపెనీలో అందులోనే ఉంటూ అక్కడే పనిచేస్తున్నాడు. తను రాత్రి సమయంలో నడుచు కుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్పెక్టర్ నరసయ్య తెలిపారు.



## నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**శంకర్‌పల్లి, జనవరి 11, ప్రభాతవార్త :** శంకర్ పల్లి మున్సిపాలిటీలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు దామోదరం రాజనర్సింహ కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. రూ.15కోట్ల అభివృద్ధి పనుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.